# శశి కోపం

ఉదయం ఏడుగంటలైనది సూర్యుని పసిడి కిరణాలు మంచంమీద పడుతున్నవి. పనిమనిషి ముంగిల్లు ఊడుస్తున్నది. చల్లటి పిల్లగాలులు వీస్తున్నవి. అలాగే పండుకొని యేదో ఆలోచిస్తున్నాను ఇంతలో పనిమనిషి వచ్చి, "ఏం బాబూ ఇక్కడ పండుకొన్నారు. తెల్లవార్లు మంచు పడుతూనే ఉన్నది. రోజూ ఇంట్లో మంచాలువేసుకొనే వారు ఇక్కడెందుకు వేసుకొన్నారు బాబూ" అన్నది.

నాకు చాలా ఆశ్చర్యమేసింది. ఆశ్చర్యముతో నే కళ్లు విప్పి ప్రక్కన చూచాను శ్రీమతిగాని ఆమెమంచముగాని లేదు. రోజూ పదిగంటలవరకు చల్లగాలికోసం బయటవేసుకొనటం ఆ తరువాత మంచుపడుతున్నదని మా ఆవిడ లేపటం, మంచాలు ఇంట్లో వేసుకొనటం అలవాటు. ఈ రోజు ఇలా జరిగిందేమా అనుకొంటూ లేచి ఇంట్లోకి వెళ్ళాను

మా ఆవిడింకా నిదుర లేవలేదు. ముసుగు తీస్తూ "శశీ ఏమిటే మొద్దునిద్దుర. ఏడున్నర అయింది ఇంకా నిదుర లేవకపోతే యెలా? ఈ రోజు శనివారం కదూ త్వరగా ఆఫీసు కెళ్లాలి త్వరగాలే ఊ...ఊ.. త్వరగా లే" అని లేపాను

శశి లేస్తూ నావైపు వింతగా చూసింది. తరువాత తరువాత కోపంతో ముఖం అంతా యెఱ్ఱగా మారింది. "ఊ! మొద్దునిద్దుర... మొద్దులం! పశులవుముగా కూడా కనబడుతాము మీ కంటికి" అంటూ విసురుగా లేచి పెరటిలోకి వెళ్ళింది.

నేను నిర్ఘాంతపోయాను ఇంతకోపం యెందుకు వచ్చిందా అని. "మొద్దు నిద్దుర" అన్నందుకే కోపంవచ్చిందా. అదైనా లాలనగానే అన్నానే. ఇంతకుముందు యెన్నిసార్లు హేళనచేయలేదు! వాటికి కొద్దిగానన్నా కోపగించుకోకుండా నవ్వి ఊరుకొనేది. ఎంతో ఆలోచించాను. ఆలోచించి, ఆలోచించి బుఱ్ఱ వేడెక్కి ముఖం కడుగుకొనటానికి వెళ్లాను.

పత్రిక చదువుతూ పడకకుర్చీలో పడుకొన్నాను. శశి కాఫీ తీసుకొచ్చి ప్రక్క టేబిలుమీద పెట్టి వెళ్ళింది. అప్పుడుకాని తెలియలా శ్రీమతికోపం తారస్థాయినందుకొన్నదని. ఎందుకంటే రోజూ కాఫీ తీసుకొచ్చి చేతికందిచ్చి తను ప్రక్కనున్న టేబిలుకు వయ్యారముగా ఆనుకొని పేపరు విషయాలు అడుగుతూ మధ్య మధ్య తన స్కూలుఫైనలు మిడిమిడి జ్ఞానముతో నన్ను వేధించి తను చిరాకుపడిగాని మరీ వదిలేదు కాదు.

మళ్లీ ఆలోచనలు మెదడులో విహారిస్తున్నవి. ఇంత కోపము రావటానికి కారణమేమిటో తెలియలేదు. గడియారం పది గంటలు కొట్టింది. ఆఫీసుటైమయిందని చల్లారిన కాఫీ త్రాగి ఆఫీసుకెళ్లాను.

ఆఫీసులో నా టేబిలుముందు కూర్చున్నాను వర్కుచేద్దామని ఒక ఫైలు తీశాను. మనస్సంతా చీకాకుగా ఉన్నందున వర్కుయే మాత్రము చేద్దామన్నా మనస్కొప్పటంలేదు. ఇక్స్ప్లెక్షను దగ్గరకు వస్తున్నది. టేబిలు డెస్కుల్లోనుంచి సరిచూడవలసిన ఫైల్సు అన్నీ తొంగిచూస్తున్నవి. అవన్నీ నా చేతగాని తనాన్ని చూచి వెక్కిరిస్తున్నవా అని అనిపించింది తలనొప్పి నెమ్మదిగా మొదలు పెట్టింది తల చేత్తోపట్టుకొని మోచేతులు టేబిలుమీద పెటి ఆలోచించడం మొదలుపెటాను.

## కౌశిక లక్ష్మీనారాయణ

ఇంతలో మూర్తి వచ్చి "ఏరా అలా ఉన్నావు. ఒంట్లో బాగుండలేదా" అని పరామర్శించాడు.

"ఏం లేదండి," అని ముభావంగా సమాధాన మిచ్చాను.

ప్యూనువచ్చి ఆఫీసరు రమ్మంటున్నాడంటే వెళ్ళాను.

ఆఫీసరు "రామారావ్! ఆ స్టేటుమెంటు పూర్తిఅయిందా" అన్నాడు.

"కాలేదండి" అన్నాను.

"ఆ స్టేటు మెంటు చాలా అర్జంటు. త్వరగా కావాలి" అంటూ "అదేమిటోయ్ అలా నీరసంగా ఉన్నావు. వంట్లో బాగుండకపోతే ఆ స్టేటుమెంటు పూర్తిచేసి ఇంటి కెళ్ళు" అన్నాడు.

ఆ స్టేటుమెంటు పూర్తి చేసి ఇంటికి బయలుదేరాను. శశికి ఇంత కోపము రావటానికి కారణమేమిటా అని యెంత ఆలోచించినా, సమస్య సమస్యగానే ఉండిపోయింది. కోపానికి కారణము దానినే అడిగితే తెలిసిపోతుందని ఇంట్లో అడుగుపెట్టాను. శశి వంటఇంట్లో ఉన్నది. కాళ్ళు కడుక్కోటానికి పెరట్లోకెళ్ళి మరల ఇంట్లోకొచ్చేటప్పటికి పీటవాలి స్థలంలో భోజనం, కావలిసినవన్నీ ఆ చుట్టూ పెట్టివున్నవి. సరే ఇంకా కోపం తగ్గలేదని భోజనంచేసి హాలులోకి వచ్చాను

శశి కుర్చీలో ముఖంవాల్చుకొని కూర్చున్నది. కళ్ళు ఎఱ్ఱగాఉన్నవి. మరలా ఆఫీసు కెళ్ళటానికి షర్టు వేసుకొంటూ దగ్గర కెళ్లాను. కళ్ళవెంట నీళ్ళు కారుతున్నవి. ముక్కు చీదేస్తున్నది.

మా నాలుగేళ్ల సంసార జీవితంలో శశి యేడుస్తున్నప్పుడు నేనెప్పుడూ చూడలేదు. నాకు యేమీ తోచలేదు. దానిముఖం నావైపు త్రిప్పుకొని "ఏమిటిదంతా? ఎందుకింత కోపం? నేనేమన్నానని, యేమి చేశానని. అబ్బే 'ఏడవటంకూడా యెందుకు" అంటూ దగ్గరకు తీసుకోబోయాను.

ఈ మాటలతో కోపం మరీ యెక్కువైంది "ఏంచేశా నంటున్నారు, యేమీ తెలియనట్టు. యేమయితే నాకెందుకు, నేను ఈ సాయంత్రం మాయింటి కెళ్లుతున్నాను" అన్నది.

"వారంరోజులేగా అయింది మీయింటి కెళ్ళొచ్చి. మీయింటి కెళ్ళవలసిన అవసరం ఇప్పుడేమొచ్చింది?" అన్నాను.

"పనిమనిషిమీద ఉన్న ప్రేమైనా నామీద లేనప్పుడిక్కడ యెందుకుండాలి" అన్నది.

ఈ మాటలు విని మొదట నిర్ఘాంతపోయాను. తరువాత ఈ నిందకు అవమానము, అసహ్యముయేసి బయటికొచ్చాను

గోడ్డుదాటి అలా మలుపుతిరిగే టప్పటికి మూర్తి యెదురయినాడు. "ఏరా ఆఫీసుకినా పోయేది" అన్నాడు.

"లేదు. ఒంట్లో యేమీ బాగుండలేదు. అలా హాస్పిటలుకు వెళ్లుతున్నాను. ఈ పూటకు సెలవు పెడతాను ఆఫీసరుకు ఇస్తావా" అన్నాను.

"అలాగే" అన్నాడు.

సెలవు చీటీవ్రాసి మూర్తికిచ్చి అలా బయలుదేరాను. ఆ గొందికుండా ఆలోచిస్తూ నడుస్తున్నాను. ఊరి చివరకు వచ్చేశాను. ఇంకా నడిచి కొన్ని పొలాలుదాటి ఒక కుంట కట్టమీద చెట్టుక్రింద కూర్చొని ఆలోచన మొదలుపెట్టాను, శశి అట్లా అనుమానపడటానికి కారణాలేమిటా అని.

పనిమనిషి వయసుదేకాని దుష్ప్రవర్తన

డలది కాదు. పోనీ నే నేమన్నా, యెప్పు కన్నా కొంటెతనముగా ప్రవర్తించానా అంటే అదీ లేదు. ఎంతగా నన్ను నేను విమర్శించుకున్నా శశి నన్ను అనుమానించటానికి కారణాలేమీ కనబడలేదు. కారణాలేమీ కనబడకపోయేటప్పటికి శశిమీద కోపమొచ్చింది. ఇన్నాళ్ళబట్టి నన్ను, నా ప్రవర్తనను అర్థముచేసుకోలేక పోయిందేమా అని. శశికికూడా నేనంటే వల్లమాలిన అభిమానము. తాను నావంటిభర్తను పొందటం పూర్వజన్మ సుకృతమని చెప్పటం యెన్నిసార్లు విన్నాను! ఇలా, అనుమానపడటానికి నిగూఢమైన కారణమేదో ఉండి ఉండాలి. ప్రతిచిన్న విషయానికి ఆడవాళ్ళు అనుమానపడటం పరిపాటి. ఇలా శశిమీద కోపంపోయి మొత్తం ఆడజాతిమీదే కోపంవచ్చింది. ఇలా ఆలోచిస్తూ, కోపగించుకుంటూ, అసహ్యించుకుంటూ, చీకటి పడిందాకా అక్కడే ఉన్నాను.

నెమ్మదిగా బయలుదేరి ఇంటికొచ్చాను. దీపాలు వెలగించలేదు. ఇల్లంతా చీకటిగా ఉన్నది. శశి వంట ఇంట్లో ఉన్నట్లున్నది. సరే ఆ చీకట్లోనే ఛైర్లో కూర్చున్నాను.

ఇంతలో మూర్తి భార్య "ఏమే పిల్లా" అంటూ నన్ను చూడకుండా నే వంట ఇంట్లో కెళ్లింది.

"ఏమే శశీ! తమ్ముడెక్కడి కెళ్ళాడు!" అంది.

"ఏమో యెక్కడి కెళ్ళారో" అని మా ఆవిడన్నది.

సరే వీళ్ల సంభాషణ చప్పుడుకాకుండా విందామని అలాగే కూర్చున్నాను.

"అలా ఉన్నావేమే శశీ!"

మా ఆవిడ యేమీ మాట్లాడలేదు.

"అదేమిటే మాట్లాడవేం" అన్నది.

మా ఆవిడ రుద్ధకంఠంతో "ఏం లేదు వదినా" అన్నది

సమాధానం చెప్పకుండా వుమిలి వుమిలి యేడుస్తున్నది.

ఆమె లాలనగా "నాతో చెప్పు యేమి జరిగింది? నాతో చెప్పకపోతే యెవరితో చెప్తావు! ఊ...చెప్పు" అని బ్రతిమిలాడింది.

"రాత్రి వారు నన్ను కొట్టారు వదినా. ఇవాళ్లా అదోమాదిరిగా ఉన్నారు." అని అంటూ దుఃఖం కట్టలుతెగి భోరున యేడ్చింది.

నా ఆశ్చర్యానికి అంతులేదు. నేను దానిని కొట్టానా! యెన్ని అబద్ధాలాడుతున్నదని అనుకున్నాను.

"కొట్టాడా! దేనికి కొట్టాడు" అని ఆమె ఆశ్చర్యముతో అడిగింది.

"ఏం లేదండి. రాత్రి బయట మంచాలు వేసుకున్నాము. అర్ధరాత్రప్పుడు మంచు బాగా పడుతున్నది. మంచాలు ఇంట్లో వేద్దామని వారిని లేపాను. లేపాననికోపంతో ఆ చెంపా ఈ చెంపా వాయించారు."అన్నది.

"ఈచిన్న విషయానికే కొట్టాడా? ఈమగవాళ్లె మనస్సులు అర్థంచేసుకోవటమేకష్టం! జ్వరంగా ఉన్నదని సాయంత్రం లీవు పెట్టాడట ఎక్కడికెళ్ళాడు?" అన్నది.

మా ఆవిడ ఆశ్చర్యముతో "జ్వరము తగిలిందని శెలవుపెట్టారా?" అన్నది.

ఆమె "ఊ.. సరే నేను వెడతా" అంటూ లేచింది.

"దీపం చూపిస్తానుండు వదినా" అంటూ శశి, ఆమే హాల్లో కొచ్చారు.

నన్ను చూచి శశి నాదగ్గర కొస్తున్నది.

ఆమె నన్ను చూచి "ఏరా, రామూ, ఈమధ్య మంచి ప్రయోజకత్వం సంపాదించావని వింటున్నాము," అంటూ నాభార్యతో "వెళ్ళొస్తానే" అంటూ వెళ్లింది.

అవమానంతో శరీరమంతా కుంచుకుపోయింది. తల దానంతట అదే వంగిపోయింది.

శశి నా వద్దకు "జ్వరము తగిలి యెక్కడికెళ్లారు" అన్నది.

కొద్దిసేపు ఉండి "రాత్రి నిన్ను కొట్టానా?" అన్నాను.

"దేనికిప్పుడా విషయం?" అన్నది.

"అదికాదు. నిజంగా నిన్ను కొట్టానా?" అన్నాను.

శశి నాముఖం వైపు అదోలా చూచి అవునన్నట్టు తలకాయ ఊపింది.

ఆశ్చర్యముతో యేమీ తోచక అలాగే దాని ముఖం వైపు చూస్తూ ఉండిపోయాను. తళుక్కున ఐడియా తట్టింది.

"శశీ నీవు సైన్సులో మెడల్లాను గురించి చదివే ఉంటావు. అది చేసేపను లేమిటి?" అంటూ సాక్షిగా నవ్వుతూ అడిగాను.

నా యీవింత ప్రశ్నకు శశి మొదట బిత్తరపోయి తరవాత "అసంకల్పిత ప్రతీకార చర్యలు" చేస్తుందన్నది.

"సరే అలాగైతే నేను చెప్పేది సాక్షిగా విను. రాత్రికలలో ఎందుకో ఒక వుజ్జాడిని కోపంతో చెంపలు వాయించాను. బహుశా నీవు ఆసమయంలోనే నన్ను లేపి ఉంటావు" అన్నాను.

"నన్ను యెందుకు పిచ్చిదాన్ని చేసి చెప్తారు. నన్ను మభ్యపెట్టటానికి ఇదో కథ అల్లారు" అన్నది.

"అది కాదు శశీ ఈనాలుగు సంవత్సరాలలో యెప్పుడన్నా నీమీద చెయ్యి చేసుకున్నానా? అదికాక ఇటువంటి చిన్నవిషయానికికొట్టేటంతమూర్ఖుడునా—నీవునన్ను బహుశా గాభరాగా లేపి ఉంటావు..." అన్నాను.

"అవును గాభరాగానే లేపాను. నాకు మెలకువ అకస్మాత్తుగా వచ్చింది. మంచు బాగా పడుతోంది. మీరు మఫ్లరు కూడా కట్టుకోలేదు. అయితే ఇదంతా ఆమెడల్లా ప్రభావమే నన్నమాట" అన్నది.

అవునన్నాను శశిని దగ్గరకు తీసుకొంటూ. చెంపలు తడుముకుంటూ "ఎలాగైతే నేమి చెంపలువాచేట్టు కొట్టారు" అన్నది బుంగమూతి పెట్టి.

"ఎన్ని దెబ్బలు కొట్టాను" అన్నాను నవ్వుతూ.

"నాలుగో ఐదో" అన్నది.

"అయితే వాటికి నష్టపరిహారంగా వాటికి డబులు ముద్దులు ఆచెంపల మీదే పెట్టనా" అన్నాను.

"వాటికి కొదవేమిటి. మీ వళ్ళంతా కాగిపోతోంది. మంచాలు ఇంట్లో నే వేస్తాను. కాఫీ త్రాగి పడుకోండి," అన్నది.

"ఇంక మనము మంచాలు బయట వేసుకోవద్దు ఎప్పుడూ ఇంట్లోనే వేసుకుందా" మన్నాను నవ్వుతూ.

శశి మందహాసంజేసి "సరే లేండి మరీ" అంటూ కాఫీ తీసుకురావటానికి ఇంట్లో కెళ్ళింది.

ఆ మందహాసంతో ఆ రోజల్లా అదోలా ఉన్న మా యింటిలో ఆనందం వెల్లివిరిసింది:

ఎలా అయితే నేం అన్యోన్య జీవులం అవాంతరంనుండి బయట పడ్డాము. ★

పండిత డి.గోపాలాచార్యులవారి
అరుణ
గర్భాశయ రోగనివారిణి
ఆయుర్వేదాశ్రమం,
(ప్రైవేటు) లిమిటెడ్, మద్రాసు-17.